



క్లాక్ టవర్ వద్ద ఉన్న మున్సిపల్ అద్దె దుకాణాలు

అద్దె గదుల్లో ఆత్మలు..!

మున్సిపల్ దుకాణాల్లో బినామీలు ఏళ్లుగా తిష్ట

9 మంది చనిపోయిన వారి పేరిట నిర్వహణ

ముస్సిపాలిటీకి చెందిన అద్దె దుకాణాల్లో ఆత్మలు వ్యాపారాలు చేస్తున్నాయి. కదిరిలో ఈ చోద్యం వెలుగులోకి వచ్చింది. పురపాలక సంస్థకు చెందిన అద్దె దుకాణాలు పొందిన 9 మంది చనిపోయారు. అయినా.. వాటిలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. బినామీలు తిష్ట వేసి, మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. మొత్తం 72 దుకాణాలు ఉంటే.. 9 మంది మాత్రమే అసలైన లీజుదారులు వ్యాపారులు చేస్తున్నారంటే బినామీలు హవా ఏ స్థాయిలో నడుస్తోందో అర్థం చేసుకోవచ్చు. తక్కువ అద్దెకు తీసుకున్న కొంత మందికి ఎక్కువకు వ్యాపారులకు కట్టబెట్టి ప్రతినెలా వేలల్లో జేబులు నింపుకుంటున్నారు. అయినా.. కూడా మున్సిపాలిటీకి అద్దె చెల్లించకుండా ఎగ్గొడుతున్నారు. బకాయిలు లక్షల్లో పేరుకుపోయినా.. అధికారులు నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- పేరుకుపోయిన బకాయిలు
- మున్సిపల్ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు
- వేలం నిర్వహణపై సందేహాలు



కదిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెందిన అద్దె దుకాణాల్లో బినామీలు తిష్ట వేశారు. ఏళ్లుగా పేరుతో దుకాణాలు నిర్వహిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. నిబంధనలను తుంగలోకి తొక్కి ఇష్టారాజ్యంగా దుకాణాలను తమ వారికి కట్టబెట్టారు. చనిపోయిన వారి దుకాణాలు సైతం మున్సిపాలిటీకి అప్పగించలేదు. ప్రజాప్రతినిధులు సైతం మున్సిపల్ దుకాణాలు అద్దెకు తీసుకున్నారు. సంవత్సరాల తరబడి మున్సిపాలిటీకి అద్దెలు చెల్లించకుండా దుకాణాలు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీ ఆదాయానికి లక్షల్లో గండి పడుతున్నా పాలక వర్గం కానీ, అధికారులుగానీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. కొంతమంది ప్రజాప్రతినిధులు సైతం బినామీ పేర్లతో దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ పాలకవర్గం కొలువుదీరాక అద్దె దుకాణాల్లో వాస్తవాలను తెలుసుకోవడానికి చైర్‌పర్సన్.. కమిటీని నియమించింది. అ కమిటీ ఇటీవలే పర్యటించి నిజనిర్ధారణ చేసింది. అందులో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చినట్లు తెలిసింది. నివేదికను కౌన్సిల్ సమావేశంలో బయటపెట్టి దానిపై చర్చించిన తరువాత కౌన్సిల్ తీర్మానం మేరకు చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

బినామీలే అధికం

మున్సిపాలిటీకి పట్టణ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో 72 అద్దె దుకాణాలు ఉన్నాయి. వీటిల్లో కొంతమంది సంవత్సరాల తరబడి దుకాణాలు నిర్వహిస్తున్నారు. 9 మంది మాత్రమే అసలైన దుకాణదారులు ఉన్నారు. మిగిలిన వారు ఒకరి పేరుతో మరొకరు వ్యాపారాలు చేస్తున్నారు. 9 దుకాణాలకు సంబంధించి లీజు పొందినవారు చనిపోయారు. అయినా ఆ షాపులను వారి సంబంధికులు నిర్వహిస్తున్నారు. మరో 31 మంది అద్దె గడువు తీరినవారు ఉన్నారు. వీరందరూ తిరిగి తమకే రెన్యూవల్ చేయాలని కోరుతున్నారు. నిబంధనల ప్రకారం అద్దెకు దుకాణం తీసుకున్న వ్యక్తి చనిపోతే మున్సిపాలిటీ దానిని వెంటనే వెనక్కు తీసుకోవాలి. తిరిగి వేలం నిర్వహించి, గదులు కేటాయించాయి. అద్దె దుకాణాలు తీసుకున్న వారిలో 9 మంది చనిపోయినా ఆ దుకాణాలను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోలేదు. ప్రజాప్రతినిధులకు దుకాణాలు కేటాయించరాదన్న నిబంధనను తుంగలో తొక్కారు. ఓ ప్రజా ప్రతినిధి పేరుతో నేరుగా మూడు దుకాణాలు కేటాయించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మున్సిపల్ ఆదాయానికి గండి

మున్సిపల్ దుకాణాల్లో కొంతమంది ఏళ్ల తరబడి అద్దె చెల్లించకుండా వ్యాపారాలు చేస్తున్నారు. ఇప్పటివరకు మున్సిపాలిటీలో అద్దె దుకాణాల బకాయిలు దాదాపు రూ.36 లక్షలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ బకాయిల వసూళ్లలో అధికారులు మీనవేషాలు లెక్కిస్తున్నారు. అద్దె గదుల్లో 9మంది మాత్రమే అసలైన వారున్నారని అధికార వర్గాలే పేర్కొంటున్నాయి. మిగిలిన వారు తక్కువ అద్దెకు మున్సిపాలిటీ నుంచి దుకాణాలు తీసుకుని, ఇతరులకు ఎక్కువ అద్దెకు ఇస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. మున్సిపాలిటీ ఒక దుకాణాన్ని రూ.6 వేలకు అద్దెకు ఇస్తే దాన్ని రూ.20 వేలకు వేరొకరికి ఇచ్చుకుని, సొమ్ము చేసుకుంటున్నారు. వేలం పాటలో సిండికేట్ అయి మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి అద్దెలు చెల్లించకున్నా వారినే కొనసాగించడంలో పాలకపక్షం, అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేలం నిర్వహించేరా?

మున్సిపల్ అద్దె గదులకు వేలం పాట నిర్వహణపై పట్టణ ప్రజలు, పలువురు కౌన్సిలర్లు సందేహం వ్యక్తం చేస్తున్నారు. చైర్‌పర్సన్ నియమించిన కమిటీ ఇటీవల మున్సిపల్ అద్దె దుకాణాలను పరిశీలించింది. ఎవరు అసలైనవారో, ఎవరు బినామీలో తేల్చింది. అదే సమయంలో 9 మంది చనిపోయినట్లు గుర్తించింది. మొత్తం 72 గదులు ఉన్న మున్సిపాలిటీలో 9 మినహా అన్నింటికీ వేలంపాట నిర్వహించాలి. 31మంది ప్రస్తుత దుకాణదారులు తమకు తిరిగి రెన్యూవల్ చేయాలని కోరుతున్నారు. ఈ అంశాలపై కౌన్సిల్‌లో చర్చ జరగాలి. ఒకవేళ మెజారిటీ కౌన్సిల్ సభ్యులు రెన్యూవల్ చేయాలని నిర్ణయిస్తే 33 శాతం అద్దె పెంచి కేటాయిస్తారు. అలాకాని పక్షంలో అన్ని దుకాణాలకు వేలం నిర్వహించాల్సి ఉంటుంది. వచ్చే కౌన్సిల్‌లో కమిటీ.. అద్దె దుకాణాలపై నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది. వీటిపై కౌన్సిల్ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.



కౌన్సిల్ నిర్ణయం మేరకే రెన్యువల్

చైర్‌పర్సన్ నియమించిన కమిటీ ఇటీవల అద్దె దుకాణాలను పరిశీలించింది. కమిటీ నివేదికను వచ్చే కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెడతాం. దానిపై కౌన్సిల్ తీసుకునే నిర్ణయాలు నిబంధనలకు అనుగుణంగా ఉంటే అమలు చేస్తాం. లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

\- కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- నూతన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు నూతన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆయన శనివారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి శక్తి వంచనలేకుండా కృషిచేస్తానన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్య రంగాల్లో ముందంజలో నిలిపేందుకు అధికారులతో కలిసి కృషి చేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తానన్నారు. అనంతరం జేసీ అభిషేక్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, మహేష్, వీవీఎస్ శర్మ, ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఖాద్రీశా.. పాహిమాం..

- శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



కిక్కిరిసిన ఆలయ ఆవరణం

కదిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన ఖాద్రీశుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం కిక్కిరిసిపోయింది. వారాంతపు సెలవులు కావడంతో శుక్రవారం రాత్రి నుంచే భక్తులు ఆలయానికి వచ్చారు. శనివారం కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో గంటలకొద్దీ వేచి ఉన్నారు. అన్నమయ్య జిల్లా భజన బృందం కోలాటం ప్రదర్శించింది.

రాజీకి లోక్ అదాలత్ చక్కటి మార్గం

న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేసుల్లో రాజీకి లోక్ అదాలత్ చక్కటి మార్గం అని పుట్టపర్తి జూనియర్ సివిల్ న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్ అధ్యక్షతన లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 130 వరకు కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. చెక్‌బౌన్స్, బ్యాంకు ప్రీలిటిగేషన్ కింద మొత్తం రూ.11.82 లక్షల పరిహారం బాధితులకు అందేలా చూశామన్నారు. చిన్నచిన్న విషయాలకే కేసులు పెట్టి, కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగితే తీవ్రంగా నష్టపోతున్నారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చెక్‌బౌన్స్ కేసుల్లో కక్షిదారుల మధ్య సయోధ్య కుదిరితే చెల్లింపులకు గడువుతోపాటు అవార్డు జారీ చేస్తామన్నారు. ఈక్రమంలోనే రాజీకాదగ్గ కేసులకు పరిష్కారం చూపి, అవార్డు ప్రతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, క్రిమినల్‌క్లర్క్ మంజునాథ్, సివిల్ క్లర్క్ జ్యోతిబాయి, ఎంఎల్ఏసీ లక్ష్మానాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.



కక్షిదారుడికి అవార్డు ప్రతిని అందజేస్తున్న న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్

కోర్టు భవనాలకు స్థల పరిశీలన

పుట్టపర్తికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవనాల నిర్మాణానికి పుట్టపర్తి కప్పలబండ సమీపంలో స్థలాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్, జాయింట్ కలెక్టర్ అబిషేక్ కుమార్ పరిశీలించారు. సత్యసాయి మహా సమాధిని దర్శించుకునేందుకు ఆయన పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి శనివారం ఆయన వచ్చారు. జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్, బార్ అసోసియేషన్ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవనాలకు అవసరమైన స్థలం రైల్వే స్టేషన్ ఎదురుగా జిల్లా యంత్రాంగం గుర్తించిందని, కానీ కోర్టు వివాదం ఉందని జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌కు బార్ అసోసియేషన్ నాయకులు వివరించారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించినా సమస్య పరిష్కారమౌతుందని అన్నారు. అనంతరం జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ అధికారులతో కలిసి కప్పలబండ పొలంలో రెండు చోట్ల స్థలాలను పరిశీలించారు. ఇందులో మెరుగైన స్థలాన్ని గుర్తించి, జిల్లా కోర్టు కాంప్లెక్ ఏర్పాటు చేస్తామని అధికారులు ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవనాల కోసం కప్పలబండ సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, జేసీ అభిషేక్ కుమార్ తదితరులు

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని



మహాసభల్లో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని

అనంతపురం టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు కొనసాగిద్దామని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సభకు మాలిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి జెండా ఎగురవేసి సభను ప్రారంభించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వరలక్ష్మి, నాగమణి సంయుక్తంగా సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాలిని మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. పిల్లలకు 30, 40 సంవత్సరాలుగా భోజనం వండిపెడుతున్నా ఎలాంటి గుర్తింపు, భరోసా లేదని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వేధింపులు, తొలగింపులను కార్మికులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ కనీస వేతనం రూ.700 ఇవ్వాల్సి ఉందని, కానీ తక్కువ వేతనంతోనే సరిపెడుతున్నారని అన్నారు. ప్రసూతి సెలవులు కూడా ఇవ్వడం లేదని అన్నారు. అనారోగ్యానికి గురై ఆస్పత్రికి వెళితే, కార్మికులే ఇతరులను ఏర్పాటు చేసి వెళ్లాల్సి వస్తోందని, లేకుంటే రాజీనామా చేయాల్సి వస్తోందని అన్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లినా రోజుకు రూ.200 నుంచి రూ.300 వేతనం ఇస్తారని, కానీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు కేవలం రూ.3 వేలు ఇస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు (మిగతా 6లో..)

డీఎస్సీ ఎంపిక జాబితా వచ్చేసిందోచ్..

773 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

మిగిలిపోయిన 34 పోస్టులు

(6లో...)

ఇద్దరికి డైరెక్టర్ పదవులు





పుట్టపర్తి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో ఇద్దరికి నామినేటెడ్ పోస్టులు వచ్చాయి. ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరక్టర్ (ఏపీఐఐసీ) డైరక్టరుగా రొళ్ల మండలం రొళ్లకొండకు చెందిన టీడీపీ నాయకుడు సి.రామకృష్ణ నియమితులయ్యారు. ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌గా డైరక్టరుగా లేపాక్షి చెందిన టీడీపీ నేత జయప్పను నియమించారు.

బానిసెల్..!

మొబైల్ వ్యసనం బారిన కుటుంబం

కార్టూన్ల లోకంలో పిల్లలు

రీల్స్ పిచ్చిలో యువత

సోషల్ మీడియాలో పెద్దలు

ప్రమాదంలో పిల్లల భవిష్యత్తు

(వివరాలు 6లో...)

కొత్త బాస్ సతీష్ కుమార్

- ఎస్పీ రత్న బదిలీ



ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ రత్న బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గుంటూరు జిల్లా అర్బన్ ఎస్పీ సతీష్ కుమార్‌ను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్పీ రత్న గత ఏడాది జూలై 17న బాధ్యతలు చేపట్టారు. 13 నెలల 20 రోజులు ఆమె విధులు నిర్వహించారు. నేర నియంత్రణ, భద్రతలో సాంకేతికతను విశేషంగా వినియోగించుకున్నారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. జిల్లాలో సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను బలోపేతం చేశారు. కొత్త ఎస్పీ సతీష్ కుమార్ 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. తమిళనాడులోని ఓ వ్యవసాయి కుటుంబంలో జన్మించారు. బీటెక్ బయోటెక్నాలజీ చేశారు. మొదట గ్రూప్-2 ఉద్యోగం సాధించి, తమిళనాడు ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో రెండున్నర సంవత్సరాలు పనిచేశారు. ఆ తర్వాత ఐపీఎస్ సాధించిన ఆయన, చింతపల్లి ఆదనపు ఎస్పీగా, నర్సీపట్నం ఓఎస్‌డీగా, అల్లూరిసీతారామరాజు జిల్లా ఎస్పీగా పనిచేశారు. ప్రజా స్నేహపూర్వక పోలీసింగ్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గుంటూరు అర్బన్ ఎస్పీగా నాకాబందీ, రాత్రి తనిఖీలు, మహిళల కోసం హెల్ప్‌లైన్, యువతకు ఉపాధి కార్యక్రమాలతో ప్రశంసలు అందుకున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, రౌడీయిజం, సైబర్ నేరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకున్నారు.

కాంచీపురానికి ధర్మవరం నేతన్నలు

చేనేత క్లస్టర్‌పై అవగాహన టూర్‌కు 45 మంది..

ధర్మవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నేతన్నలు హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌పై అవగాహన పెంచుకునేందుకు శుక్రవారం కాంచీపురానికి బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు 45 మంది చేనేతలను కాంచీపురం టూర్‌కు తీసుకెళ్లినట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు తెలిపారు. ఈ టూర్ ద్వారా చేనేతలకు కొత్త సాంకేతికత, మార్కెట్ ధోరణులు, డిజైన్లలో వైవిధ్యం, ఉత్పత్తి పద్ధతులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. నేతన్నల వెంట చేనేత, జౌళి శాఖకు చెందిన ఏడీ రామకృష్ణ కూడా వెళ్లారన్నారు. త్వరలో ధర్మవరంలో ప్రారంభమయ్యే మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ అభివృద్ధికి ఈ స్టడీ టూర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన వివరించారు.



కాంచీపురానికి వెళ్తున్న చేనేతలు



అలరించిన నాటిక

పుట్టపర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలో సాయికుల్వంత్ సభామండపంలో బాలవికాస్ చిన్నారులు శనివారం రాత్రి ప్రదర్శించిన బాలకాండలో సంస్కరణలో పర్వం నాటిక భక్తులను అలరింపజేసింది. తెలంగాణ, సంగారెడ్డి భక్తులు పర్తియాత్రగా శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు గంటపాటు సంగీత నృత్యంతో మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న భక్తులు.. నృత్యం చేస్తున్న చిన్నారులు

గిజిగాడు.. విలవిలలాడు..!

మట్టి మిద్దెలు మాయమాయె
తాటాకు కొట్టాలు తరిగిపాయె
కాంక్రీటు అడవిలో గిజిగాడు
గూడు కట్టలేక విలవిలలాడె..!

ప్రకృతి విరుద్ధ ఏర్పాట్లు
ప్రాణాలు తీసేస్తుంటే..
పాపం.. గువ్వ పిట్టలు..
గుండెలవిసేలా రోధించె..!

పాత రోజులే బాగుండె..
ప్రాణాలకు ఏ లోటూ లేకుండె..!











(బుక్కరాయసముద్రం బస్టాప్‌లో గువ్వల ఆవాసం కోసం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ చెంబులు, వాటికి కట్టిన దారాలు ప్రాణాంతకంగా మారాయి. ఆ చెంబులలో గూడు కట్టుకున్న గువ్వల కాళ్లకు దారాలు చుట్టుకుని బంధిస్తున్నాయి. విలవిలలాడుతూ, ఆకలి దప్పులతో ప్రాణాలను విడుస్తున్నాయి..)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, అనంతపురం

అందుబాటులో 4,454 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం 4,454 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు రైతు సేవాకేంద్రాల్లో 343, ప్రైవేటు డీలర్ల వద్ద 582, సొసైటీల్లో 111, హోల్‌సేల్ డీలర్లు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 1,710, కంపెనీ గోదాముల్లో 889, రవాణాలో 819 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. రెండు రోజుల్లో 1,470 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందన్నారు.

టమోటా కిలో రూ.19

అనంతపురంరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.17తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠధర రూ.8, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3150టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

రామగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి ఈనెల 15వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారితోపాటు చేసుకోనివారు కూడా నేరుగా హాజరు కావచ్చన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్మీడియట్ ఫెయిలైన వారు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు రామగిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆస్పత్రుల ధన దాహం..!



ప్రైవేటు ఆస్పత్రిలో ఓపీకోసం నిరీక్షిస్తున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు

- అనవసర పరీక్షలు, మందులతో నిలువు దోపిడీ
- అడ్మిట్ కావాల్సిందేనంటూ హుకుం
- చేరితే చుక్కలు.. వేల రూపాయలు గుంజుతున్న వైనం
- పర్యవేక్షణ పట్టని వైద్య శాఖాధికారులు



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డెంగీ పరీక్షలు చేసిన ప్రైవేట్ హాస్పటల్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికెళ్లాలంటేనే జనాలు హడలిపోతున్నారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు నిలువు దోపిడీ చేస్తున్నాయన్నది బహిరంగ రహస్యమే. చిన్న సమస్యకు కన్సల్టేషన్ కోసమని వెళితే అనవసర పరీక్షలన్నీ చేసి.. అడ్మిట్ కావాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. పరిస్థితి ఇబ్బంది కరంగా ఉందనీ, అడ్మిట్ కాకపోతే తామేమీ చేయలేమంటూ బెదిరిస్తున్నారు. వారి బుట్టలో పడి అడ్మిట్ అయితే ఇక.. చుక్కలే. రోజులపాటు అడ్మిషన్‌లో ఉండాల్సిందే. వేలకువేలు గుంజుతారు. ఆరోగ్యం బాగు పడిందనీ, డిశ్చార్జి చేయాలని అడిగినా ఒప్పుకోరు. మరికొన్ని రోజులు ఉండాల్సిందేనంటారు. 'డాక్టర్ నేనా.. మీరా' అంటూ.. కసురుకుంటారు. కొందరైతే గొడవపడి డిశ్చార్జి చేయించుకుని వెళ్లాల్సి వస్తోంది. అప్పటికీ ఇంటికెళ్లాక ఏమైనా అయితే తమకు సంబంధం లేదంటూ భయపెడుతున్నారు. వారి తీరుతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పర్యవేక్షించాల్సిన వైద్య శాఖాధికారులు తమకు సంబంధమే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

కనీసం రూ.30వేలు

కాలానుగుణ వ్యాధులు ముసురు కోవడంతో చిన్నారులు మంచాన పడుతున్నారు. దీనిని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఆసరాగా తీసుకుంటున్నాయి. డాక్టర్‌తో చూపించుకుని తిరిగి ఇంటికి వస్తామని వెళ్తే ఆస్పత్రిలోనే చేరిపోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. రక్త పరీక్షలు, స్కానింగ్‌లు రాస్తున్నారు. వాటి ఫలితాలను చూపి అడ్మిట్ అవ్వాలని చెబుతారు. లేకపోతే ఇబ్బంది పడతారని భయపెడతారు. అనవసరమైన పరీక్షలు, మందులు రాస్తున్నారని బాధితులు వాపోతున్నారు. అడ్మిట్ అయితే రోజుకు రూ.4వేల నుంచి 8వేల వరకు బెడ్‌ఫీజు, ట్రీట్‌మెంట్ పేరుతో మరో రూ.వెయి నుంచి రూ.2వేల వరకు గుంజుతున్నారు. ఇలా డిస్‌చార్జ్ అయ్యేలోపు కనీసం రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు లాగేసుకుంటున్నారని బాధితులు మండిపడుతున్నారు.

వైద్యశాఖ నిర్లక్ష్యం

గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేలాదిమంది అధికారులు, డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పనిచేస్తున్నారు. డీఎంహెచ్ఓ పరిధిలో 45 ప్రాథమిక, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలతోపాటు 433 ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. బోలెడంత నెట్‌వర్క్ ఉంది. ఇంటిపక్కన ఆశా వర్కర్ నుంచి గ్రామంలోని సచివాలయ ఏఎన్ఎం, ఆరోగ్య ఉపకేంద్రంలోని సిబ్బంది వరకు పనిచేస్తున్నారు. ఏ ఇంటిలో జ్వరం వచ్చినా తెలుసుకునే వెసులుబాటు ఆరోగ్యశాఖ సిబ్బందికి ఉంది. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నిర్లక్ష్యం నిండుకోవడంతో పేద ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాలను ప్రైవేటు ఆస్పత్రులు తుంగలో తొక్కుతున్నా.. పట్టించుకునేవారు లేరు.

రూ.20వేలు ఖర్చయింది: తిమ్మక్క, కళ్యాణదుర్గం



నెలల పాపకు జ్వరం, దగ్గువచ్చింది. ప్రైవేటు ఆస్పత్రికెళ్తే పరీక్షలు చేసి, టానిక్‌లు రాసిచ్చారు. వాటిని తాపినా తగ్గడంలేదు. రెండు వారాలపాటు డాక్టర్‌తో చూపించుకున్నాం. రూ.20వేల వరకు ఖర్చయింది. అయినా తగ్గకపోవడంతో పెద్దాస్పత్రిలో చేర్పించాం. ఇప్పుడు కోలుకుంటోంది.



కిటకిటలాడుతున్న పెద్దాస్పత్రిలోని చిన్నారుల వార్డు

అను'మతిలేని' పరీక్షలు..

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొన్ని పరీక్షలనే ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయాలి. వాటికి ఆస్పత్రులు తిలోదకాలిస్తున్నాయి. డెంగీ పరీక్షలు నిర్వహిస్తుండడమే ఇందుకు నిదర్శనం. ఎలిషా పద్ధతిలో డెంగీ పరీక్ష చేసే అవకాశం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే ఉంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో అక్రమంగా నిర్వహిస్తున్నారు.

రూ.10వేలు పెట్టినా తగ్గలేదు..: రేణుక, ముదిగుబ్బ



మా పాప బడి నుంచి సాయంత్రం రాగానే జ్వరం వచ్చింది. ఆ రాత్రికి మాత్రవేశాం. పొద్దున్నే ప్రైవేటు డాక్టర్ దగ్గరకు వెళ్లాం. రక్తపరీక్షలు చేసి కొన్ని మాత్రలు, టానిక్‌లు ఇచ్చారు. మూడురోజుల వాడినా మార్పులేదు. దీంతో మళ్లీ వెళ్లి డాక్టర్‌కు చూపించాం. అప్పటికే రూ.10వేలు ఖర్చయింది. తగ్గకపోవడంతో పెద్దాస్పత్రిలో చేర్పించాం.

డబ్బులు పోయాల్సిందే..: రామాంజనేయులు దంపతులు, అనంతపురం



పిల్లలకు బాగోలేదంటే ప్రైవేటు ఆస్పత్రులకు డబ్బులు పోయాల్సిందే. ఒక్కో ఆస్పత్రిలో ఒక్కోరేటు ఓపీ ఉంటుంది. రక్తపరీక్షలు, స్కానింగ్‌లు రాస్తారు. మందులు ఖరీదైనవి ఇస్తున్నారు. వారానికిగాను రూ.25వేలు ప్రైవేట్ ఆస్పత్రిలో ఖర్చు చేశాం. ఆఖరుకు పెద్దాస్పత్రిలో చూపిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల దందాను ప్రభుత్వం అరికట్టాలి.

చివరగా పంపుతున్నారు..



వాతావరణ మార్పుల కారణంగా చిన్నారులకు జ్వరం, దగ్గు, జలుబు లాంటివి సోకుతున్నాయి. చాలామంది పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. వారిని పరీక్షించి, అవసరమైన చికిత్సలు అందించాలి. కొన్ని రోజులపాటు వైద్యం చేసి, జబ్బు తీవ్రమైన తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి పంపుతున్నారు. మొదట్లోనే రెఫర్ చేస్తే ఇబ్బందులు ఉండవు.

- ప్రొఫెసర్ రవికుమార్, చిన్నపిల్లల విభాగాధిపతి, సర్వజన వైద్యశాల

నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తాం



నిబంధనలను విస్మరించి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రలను సీజ్ చేస్తాం. ధరల పట్టికలను ఆస్పత్రుల్లో ప్రదర్శించాలి. అవసరమైన మేరకే పరీక్షలు, స్కానింగ్‌లు చేయాలి. డెంగీ తదితర అనుమతి లేని పరీక్షలు చేయకూడదు. వ్యాధిని నయం చేయగలమని నిర్ధారణకు వచ్చినపుడే అడ్మిషన్ చేసుకోవాలి. జబ్బు తీవ్రమైన తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసి, చేతులు దులుపుకున్నట్లు తెలిస్తే సంబంధిత డాక్టర్ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయిస్తాం.

- డాక్టర్ ఈబీ దేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

డీఎస్సీ ఎంపిక జాబితా వచ్చేసిందోచ్..

773 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

మిగిలిపోయిన 34 పోస్టులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల ఎదురుచూపులకు తెరపడింది. ఎట్టకేలకు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఎస్సీ-2025 అర్హత అభ్యర్థులను రోస్టర్, మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు. 15 రోజులుగా ఈ పక్రియ అటు అధికారులు, ఇటు అభ్యర్థుల్లో ఉత్కంఠరేపుతూ వచ్చింది. చివరకు ఎంపిక జాబితాను సిద్ధం చేసి, జిల్లా కమిటీ ఆమోదం కోసం రాష్ట్రశాఖ పంపించింది. జిల్లాలో 807 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు 45వేల మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 773 పోస్టులకు మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేశారు. వెరిఫికేషన్‌కు 776 మంది జాబితా రాగా.. ముగ్గురు అభ్యర్థుల సర్టిఫికెట్లు సరిగా లేకపోవడంతో తిరస్కరించారు. ఇక మిగిలిన 34 పోస్టులకు అభ్యర్థులు లేక మిగిలిపోయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇవి కూడా ఉర్దూమీడియం, బ్యాక్‌లాగ్ పోస్టులు అని అంటున్నారు. ఎంపిక జాబితాకు జిల్లా సెలెక్షన్ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అందులో భాగంగా రాష్ట్రశాఖ శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబుకు జాబితాను పంపించింది. తొలుత జిల్లా కార్యాలయంలో మరో సారి పరిశీలన చేయించారు. రోస్టర్ మేరకు ఏయే సబ్జెక్టులో ఎన్ని పోస్టులు ఉన్నాయి, ఆ మేరకు ఉన్నాయా.. లేదా.. అని సరిచూశారు. అనంతరం జాబితాకు ఆమోదం వేయించుకోవడానికి నూతన కలెక్టరు ఆనంద్ వద్దకు డీఈఓ ప్రసాద్ బాబు శనివారం రాత్రి తీసుకెళ్లారు. అక్కడ సంబంధిత శాఖాధికారులతో నూతన కలెక్టర్ పక్కాగా పరిశీలించి వివరాలు ఆరా తీసిన తర్వాత జాబితాకు ఆమోదం వేసినట్లు సమాచారం. మొత్తంమీద జిల్లా డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక జాబితా ఓకే అయింది. 15న అధికారికంగా ప్రకటించనున్నారు. ఆ తర్వాత అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు.



డీఎస్సీ ఎంపిక జాబితాను కలెక్టర్ వద్దకు తీసుకెళ్తున్న డీఈఓ

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

(5వ పేజీ తరువాయి)

అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కారణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని అన్నారు. అంత కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు పనిభద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్‌పీఏ విధానం అమలు చేయడంతో ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు పెరిగిపోయాయని, ప్రభుత్వ బడులు మూతపడుతున్నాయని అన్నారు. హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించరాదని, మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం జనవరి నుంచి ఉద్యమాలకు సిద్ధమవుతామని ప్రకటించారు. మూడు సంవత్సరాలుగా యూనియన్ చేపట్టిన కార్యక్రమాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి వివరించారు. భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, నాయకుడు మురళి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ కోశాధికారి సుప్రజ, ఆఫీస్ బేరర్లు మహాలక్ష్మి, సుధా, శివకుమారి, విజయమ్మ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మహాసభలు ప్రారంభిస్తున్న దృశ్యం



మొబైల్ వ్యసనం బారిన కుటుంబం

- కార్టూన్ల లోకంలో పిల్లలు
- రీల్స్ పిచ్చిలో యువత
- సోషల్ మీడియాలో పెద్దలు
- ప్రమాదంలో పిల్లల భవిష్యత్తు



బానిసెల్..!

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్ల క్రితం సెల్‌ఫోన్ అంటే కేవలం మాట్లాడుకునే సాధనం. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ అంటే ఓ ప్రపంచమే. అన్నీ అందులోనే. దానికి అన్ని వయసుల వారు బానిసలవుతున్నారు. ఒకప్పుడు పిల్లలు సాయంత్రం పాఠశాల నుంచి వచ్చాక ఇంటి సమీపంలోని ఖాళీస్థలాలు, మైదానాల్లో ఆటలతో కాలక్షేపం చేసేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్ లేకుండా పిల్లలు ఐదు నిముషాలు కూడా నిశ్చలంగా కూర్చోలేకపోతున్నారు. పిల్లలు కార్టూన్లు, యూట్యూబ్ చానల్ వీడియోలకే పరిమితవుతున్నారు. 10-12 ఏళ్లకే పబ్జీ, ఫ్రీఫైర్, బీజీఎంఐ లాంటి గేమ్స్ పట్ల ఆకర్షితులవుతున్నారు. తల్లితండ్రులు కూడా పిల్లలను శాంతింపజేయడానికి ఫోన్ ఇచ్చేస్తున్నారు. ఆదే ఆ తర్వాత పెద్ద వ్యసనంగా మారి సమస్యలను తెచ్చి పెడుతోంది.

రీల్స్ పిచ్చిలో యువత..

యువతకు సోషల్ మీడియా అంటే ఒక కలల లోకం. ప్రతిక్షణం రీల్స్ తీయడం, లైక్‌ల కోసం ఆత్రతగా చూడడం, ఫాలోవర్స్ పెంచుకోవడాన్ని సీరియస్‌గా తీసుకుంటుంటారు. దాని వెనుక ఎన్నో ప్రమాదాలున్నాయనే సంగతే మరిచిపోతున్నారు. ఈ వ్యసనం.. ముఖంగా చదువుపై తీవ్రప్రభావం చూపుతోంది. ఒక్కో విద్యార్థి సగటున రోజులో 4 నుంచి 6 గంటలు మొబైల్‌లో గడుపుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటివల్ల విద్యలో వెనుకబాటు, దృష్టిలోపంతో చదువుల్లో దిగజారుతున్నారు. ఆత్మవిశ్వాసం సన్నగిల్లడం ఇతరుల లైఫ్‌స్టైల్‌తో పోల్చుకోవడం, అసహనం, ఆందోళన, చేతిలో ఫోన్ లేకపోతే చంచలత, కోపంతో విచక్షణ కోల్పోతున్నారు.

కుటుంబాల్లో విభేదాలు

ప్రతి ఇంట్లో ఒకే దృశ్యం. భోజన సమయంలో కూడా చేతిలో మొబైల్ ఫోన్ ఉండాల్సిందే. దీంతో కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయం తగ్గిపోతోంది. తల్లితండ్రులు.. పిల్లలతో గడిపే సమయమే లేదు. మానవ సంబంధాలు సన్నగిల్లిపోతున్నాయి. సోషల్ మీడియా వ్యసనం మూలంగా సమాజంలో కొన్ని ముఖ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో సామాజిక వేరుపాటు, నిజమైన స్నేహితులు తగ్గిపోవడం, కల్చరల్ గ్యాప్, సంప్రదాయ ఉత్సవాల కన్నా ఆన్‌లైన్ ట్రెండ్స్‌కు యువత, చిన్నారులు ప్రాధాన్యం ఇవ్వడం, తరాల మధ్య అంతరం, పెద్దవాళ్లు.. చిన్నవాళ్ల మధ్య విలువలు లోపించడం, ఆలోచనల్లో పెరుగుతున్న దూరం. ఇవి ఎంతో ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● డిజిటల్ డీటాక్స్‌తో పరిష్కారం

స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడడానికి నిపుణులు కొన్ని చిట్కాలు చెబుతున్నారు. తల్లితండ్రులు పాటించాలని సూచిస్తున్నారు. డిజిటల్ డీటాక్స్ విధానాన్ని పాటించాలంటున్నారు. ఇందులో భాగంగా రోజులో కనీసం 2-3 గంటలు ఫోన్‌లేకుండా గడపడం అలవాటు చేసుకోవాలని చిన్నారుల దగ్గరై వారిక ప్రేమతో చెప్పాలి. పిల్లలతో ఆడుకోవడం మాట్లాడుకోవం చేయాలి. దీంతోపాటు సోషల్‌మీడియా మన శత్రువు కాదు-అది మన జీవితంలో ఒక అద్భుత సాధనంగా మాత్రమే చూడాలన్న భావన చిన్నారుల మనసుకు హత్తుకునే విధంగా తల్లిదండ్రులు చెప్పాలి. అది వ్యసనంగా మారితే భవిష్యత్తును, కుటుంబ బంధాలను నాశనం చేస్తుందన్న విషయాలను చిన్నారులకు చిన్నతనం నుంచే నేర్పాలి. చేతిలో ఉన్న సాంకేతిక సాధనాలను మనమే నియంత్రించుకోవాలి కానీ, అవి మనల్ని నియంత్రించకూడదన్న విషయాలను పిల్లలకు అర్థమయ్యే విధంగా ప్రేమతో తెలియజెప్పాలి. భావితరాలకు మంచి భవిష్యత్తును అందించే విధంగా తల్లిదండ్రులు మారాలి.

మానసిక ఆరోగ్యంపై ప్రభావం



డాక్టర్లు చెబుతున్న ప్రకారం సోషల్ మీడియా వ్యసనం మద్యం, డ్రగ్స్ వ్యసనానికి సమానం. ఫోన్‌లో ప్రతిలైక్, ప్రతి నోటిఫికేషన్ మెదడులో డోపమిన్ అనే సంతోష హార్మోన్‌ను విడుదల చేస్తుంది. దీనివల్ల మనిషి మరింతగా ఆదే అనుభూతి కోసం ఫోన్‌పై ఆధారపడతాడు. దీంతో నిద్రలేమి, డిప్రెషన్, ఒంటరితనం, దృష్టిలోపం, వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కావున తల్లితండ్రులు.. పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి. చిన్నారులను కాపాడుకోవాలి.

- డాక్టర్ ఫైరోజ్‌బేగం, జిల్లా వైద్యాధికారి, శ్రీసత్యసాయి జిల్లా

సైబర్ వలలో యువత: ఎస్పీ రత్న



సోషల్ మీడియా అంటే వినోదం మాత్రమే కాదు, సైబర్ నేరాల వేదిక కూడా అవుతోంది. ఫేక్ ప్రొఫైల్, ఆన్‌లైన్ బుల్లీయింగ్, బ్లాక్‌మెయిల్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. లోన్ యాప్ మోసాల్లో ఎక్కువగా 18 నుంచి 25 ఏళ్ల యువత చిక్కుకుని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గేమింగ్‌లో మునిగిపోయిన చిన్నారులు తల్లిదండ్రుల డబ్బులు ఖర్చుచేసి అప్పుల పాలవుతున్నారు.

క్రైం కార్నర్

అలా కొట్టేసి.. ఇలా చిక్కేశాడు..!

- సినిమా థియేటర్‌లో చోరీ
- అక్కడ పనిచేసే వ్యక్తే నిందితుడు
- పట్టించిన సీసీ టీవీ ఫుటేజీ

కొత్తచెరువు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పుట్టపర్తి రహదారి పక్కనున్న సందీప్ థియేటర్‌లో ఇంటి దొంగ చేతివాటం ప్రదర్శించాడు. రూ.50 వేలు అలా కొట్టేసి.. ఇలా దొరికిపోయాడు. సీసీ టీవీ ఫుటేజీలో చోరీ వ్యవహారం స్పష్టంగా తెలిసిపోయింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. థియేటర్‌లో రెండు రోజుల సినిమా ప్రదర్శన డబ్బు రూ.50వేలు బీరువాలోనే ఉంచి, మేనేజర్ తాళం వేశారు. పక్కనే తన గదిలోకి వెళ్లి శుక్రవారం రాత్రి నిద్రించాడు. ఆ డబ్బుపై థియేటర్‌లోనే పనిచేస్తున్న బోయ ధనుష్ కన్నేశాడు. శనివారం తెల్లవారుజామున ముఖానికి మాస్క్ పెట్టుకుని, మేనేజర్ గదికి బయట గొళ్లెం పెట్టాడు. ఇనుప రాడ్డుతో బీరువా పగులగొట్టి, అందులోని రూ.50వేల నగదు అపహరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆ డబ్బు థియేటర్ ఆవరణలోనే ఉన్న ఆటోలో ఉంచి, అద్దెకు ఉంటున్న గదికెళ్లి నిద్రించాడు. శనివారం ఉదయం మేనేజర్ లేచి తన గదికి గొళ్లెం పెట్టి ఉండటంతో మరొకరికి ఫోన్ చేసి, తెరవమని చెప్పాడు. అతడు వచ్చి మేనేజర్ గది తెరిచారు. తరువాత బీరువా ఉన్న గదిని పరిశీలించగా తలుపులు తెరిచి ఉండటంతో చోరీ అయినట్లు గ్రహించి థియేటర్ యజమాని లక్ష్మీనారాయణకు తెలిపారు. ఆయన వచ్చి థియేటర్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ధనుష్ చోరీ చేయడం, ఆ డబ్బు ఆటోలోనే ఉంచిన వ్యవహారం మొత్తం తెలిసిపోయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు థియేటర్‌ను పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. ఆటోలో ఉంచిన రూ.50వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-బళ్లారి రైలు మార్గంలో బెవినహాల్ రైల్వేస్టేషన్ సమీపాన శుక్రవారం రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయసు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9866144616 నంబరులో సంప్రదించాలన్నారు. వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి మత్తు

రాయలచెరువులో యథేచ్ఛగా సేవిస్తున్న యువత

యాడికి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో యువకులు గంజాయి మత్తులో తూలుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక ధాబాను, ఆ పక్కనే ఉన్న అరటి తోటను ఇందుకు ఆవాసంగా మార్చుకున్నట్లు చెబుతున్నారు. బెంగళూరు నుంచి గంజాయి పౌడర్ ఇక్కడకు సరఫరా అవుతోందనీ, దానిని సిగరెట్లలో నింపుకుని, తాగుతున్నారని సమాచారం. లారీ డ్రైవర్ల ద్వారా కూడా గంజాయి సరఫరా అవుతున్నట్లు చర్చించుకుంటున్నారు. యువకులు ఎక్కువగా దీనికి బానిసలుగా మారుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ధాబా వద్ద, పక్కనే అరటితోటలో యువకులు గుంపులుగా తిష్టవేసి గంజాయి సేవిస్తున్నారని సమాచారం. గంజాయి మత్తులో యువకులు ఎటువంటి ఆగడాలకు పాల్పడుతారోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. రాయలచెరువు పారిశ్రామిక ప్రాంతం కావడంతో గంజాయి కల్చర్ ఎక్కువ అవుతోందని వారు వాపోతున్నారు. రాయలచెరువు నుంచి చందనకు వెళ్లే రోడ్డులోని ఓ ఆలయ పరిసరాల్లో కూడా యువకులు గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో...' అంటూ ప్రచారం చేపట్టిన అధికారులు గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం



భరత్ రాజ్, లోకేష్

రాప్తాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాయపల్లి సమీపంలోని ఎల్ఆర్జీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. వారి తల్లి తండ్రులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. 8వ తరగతి విద్యార్థులు భరత్ రాజ్, లోకేష్ శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లారు. ఉదయం 9 గంటల సమయంలో పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న తల్లితండ్రులు అన్నిచోట్లా గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో రాప్తాడు సీఐ హర్షకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

లాటరీ టిక్కెట్ విక్రేతల అరెస్టు

కదిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిషేధిత లాటరీ టిక్కెట్లు, నాటుసారా అమ్ముతున్న ఐదుగురిని శనివారం అరెస్టు చేశామని పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పక్కా సమాచారంతో కుటాగుళ్ల రైల్వే గేటు సమీపంలో ఎస్ఐ బాబ్‌జాన్ దాడులు చేశారని, నాటుసారా, లాటరీ టిక్కెట్లు అమ్ముతున్న ముఠా పారిపోతుండగా ఐదుగురిని పట్టుకున్నారని సీఐ తెలిపారు. పోలీసుల దాడుల గురించి తెలుసుకుని, మరో ఆరుగురు అక్కడికి రాకుండా పారిపోయారని తెలిపారు. పట్టుబడిన వారిలో జయప్రకాష్ బాబు, బాబా ఫక్రుద్దీన్. శిలార్ బాషా, నవీన్ కుమార్, మహమ్మద్ అలి ఉన్నారు. వీరంతా కదిరి పట్టణవాసులు. నిందితుల నుంచి 5 సెల్ ఫోన్‌లు, 16 లీటర్ల నాటుసారా, 47 లాటరీ టిక్కెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి, న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పారిపోయిన వారిపైనా కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకునేందుకు తీసుకెళ్లిన ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశామని టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ శనివారం తెలిపారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్లకు చెందిన పోతులయ్య ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడని సీఐ తెలిపారు. అనంతపురంలోని కేఎస్ఆర్ కాలేజీ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని పెళ్లి చేసుకునేందుకు ఈ నెల 11న ధర్మవరం తీసుకెళ్లాడని తెలిపారు. విద్యార్థిని మైనర్ అని, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ప్రత్యామ్నాయం అందేనా..?

- జిల్లాకు 15 వేల క్వింటాళ్లతో ప్రతిపాదనలు
- నేటికీ సరఫరాకాని ప్రత్యామ్నాయ విత్తనాలు
- ముగింపు దశకు ఖరీఫ్
- బయట కొనుగోలు చేస్తున్న రైతులు



ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం చేసుకున్న భూమి

మడకశిర, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఊసేలేకుండా పోయింది. ఆ ఊసే వినిపించట్లేదు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్నా.. విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పొలాలను సిద్ధం చేసుకుని, ఎదురుచూస్తున్నారు. జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆ తరువాతి ప్రక్రియే మొదలుకాలేదు. ఏటా ఆగస్టు మొదటి వారంలోనే పంపిణీ చేసేవారు. ఈ సారి సెప్టెంబరు సగం నెల గడుస్తున్నా.. ఆ ఊసేలేకపోవడంతో అన్నదాతలు ఆశలు వదులుకుంటున్నారు. కొందరు బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేసి, పంట పెడుతున్నారు. ఇంకొందరు ఇంకా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. రైతన్నలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. అధికారులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపినా సరఫరాలో జాప్యం చేస్తున్నారు. భూములను సిద్ధం చేసుకున్న రైతులు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట వేయాలని భావిస్తున్నారు. విత్తనాలు సరఫరా చేయకపోవడంతో నిరాశ చెందుతున్నారు. జిల్లాలో 60 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపారు. నేటికీ పంపిణీ చేయలేదు.

విత్తనాలు ఇవ్వకపోతే బీడుగా వదిలేస్తా



ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుందామని రెండెకరాల పొలాన్ని సిద్ధం చేసుకున్నా. వర్షాభావం కారణంగా వేరుశనగ పంట పెట్టలేకపోయా. ప్రత్యామ్నాయ విత్తనాలు నేటికీ అందించలేదు. వారం రోజులు దాటితే ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వస్తుంది. ఇప్పటికైనా అధికారులు విత్తనాలు పంపిణీ చేయాలి. లేకపోతే పొలాన్ని బీడుగా వదిలాల్సి వస్తుంది.

-నరసింహప్ప, రైతు, కాలువపల్లి

ప్రతిపాదనలు పంపాం

మడకశిర నియోజకర్గంలో 11వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 4,500 క్వింటాళ్ల ఉలవలు, పెసలు, అలసంద, జొన్న విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపాం. సరఫరా అయిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.

-తిమ్మప్ప, వ్యవసాయ అధికారి

క్రీడాభివృద్ధిలో రాజీ ప్రసక్తే లేదు

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్
- రాయలసీమ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధిలో రాజీపడే ప్రసక్తే లేదని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ పేర్కొన్నారు. అనంత క్రీడాగ్రామంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌ను భారత మహిళా క్రికెట్ జట్టు ప్లేయర్ అనూషతో కలిసి మాంచో ఫెర్రర్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి అధునాతన వసతులతో స్టేడియం నిర్మించడం శుభపరిణామమన్నారు. క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సత్తా చాటాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి, మాజీ అధ్యక్షుడు పగడాల మల్లికార్జున, రంజీ మాజీ క్రికెటర్లు ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి, షాబుద్దీన్, ఫయాజ్ అహ్మద్, సురేష్, షాషావలి, డీబీ ప్రశాంత్ కుమార్, శివరాజ్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.



క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న మాంచో ఫెర్రర్, అనూష

అనూషకు సత్కారం



అనూషకు చెక్కును అందజేస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన జిల్లాకు చెందిన తొలి క్రికెటర్ అనూషను జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ శనివారం సత్కరించారు. ఆర్డీటీ స్టేడియంలో అనూషకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు. అనూషను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని మాంచో ఫెర్రర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16

అనంతపురం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16,500 పలికాయని మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి ధరరూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 556టన్నుల చీనీకాయలు వచ్చాయని తెలిపారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు జైలు శిక్ష

పామిడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి మహిళ మృతికి కారణమైన వ్యక్తికి గుత్తి జేఎఫ్‌సీఎం కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.2వేలు జరిమానా కూడా విధిస్తూ శనివారం తీర్పు వెలువరించింది. సీఐ యుగంధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2015లో పట్టణ సమీపాన జాతీయ రహదారిపై సయ్యద్ అబూబ్ కారు నిర్లక్ష్యంగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. అందులో ప్రయాణిస్తున్న లలితమ్మ తీవ్రంగా గాయపడి మరణించింది. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయాధికారి సయ్యద్ అబూబ్‌ను ముద్దాయిగా నిర్ధారిస్తూ ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలయాలను సందర్శించిన

తెలంగాణ అధికారులు



ఆలూరు కోనలో అధికారులు

తాడిపత్రి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు కోన, ఓబులేసు కోన, బెలుంగుహలు, హాజీవలి దర్గా తదితర ఆలయాలను శనివారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు సందర్శించారు. ఆయా ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను సందర్శించిన వారిలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఐఆర్ఎస్ అధికారి రామకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా, అమరరాజా బ్యాటరీ సీఈఓ రమణ, జనరల్ మేనేజర్ గల్లా విజయ్‌నాయుడు, పారిశ్రామికవేత్త శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఆదివారం పట్టణంలోని ఏవీఆర్ ప్యారడైజ్‌లో 1976-79 కొడిగెనహళ్లి బ్యాచ్‌కు చెందిన వీరు గెట్ టుగెదర్ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా బదిలీ



గుంతకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఎస్పీ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆయనను బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్/రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ జట్లను శనివారం ఎంపిక చేశారు. అనంతపురం నగర పరిధిలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ సెలెక్షన్స్ నిర్వహించారు. స్కూల్ చైర్మన్ అనంతరాముడు పోటీలను ప్రారంభించారు. ఎంపికైన వారి వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. స్విమ్మింగ్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో మొత్తం 45మందిని, రైఫిల్ షూటింగ్ అండర్-17, 19 బాలబాలికల విభాగాలలో 60 మందిని ఎంపిక చేశారు. వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఈఓ నరసింహారావు, ప్రిన్సిపాల్ శాలిని, పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, పీఈటీలు నిరంజన్‌రెడ్డి, ఓబులేసు, సమీరా, రేఖ, లీలారాణి, ప్రత్యూష పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలుడి మృతి

ఆస్పత్రి వద్ద తల్లిదండ్రుల ఆందోళన



కిరణ్ ఆసుపత్రి వద్ద బాలుడి తల్లిదండ్రులు

పావగడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కుందుర్పి మండలం వెంకటంపల్లికి చెందిన మూడు నెలల బాలుడు అనారోగ్యంతో మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుమారుడి మృతి కారణమని తల్లిదండ్రులు మంజునాథ్, గీత, వారి బంధువులు ఆరోపించారు. పావగడ తాలూకా లింగదహళ్లిలోని కిరణ్ ఆస్పత్రి ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన మేరకు బాలుడికి మూడు రోజుల క్రితం నోటిలో పుండు ఏర్పడింది. దీంతో లింగదహళ్లిలోని డాక్టర్ కిరణ్ ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో శుక్రవారం రాత్రి మరోసారి అదే ఆస్పత్రికి తీసుకువచ్చారు. డాక్టర్ కిరణ్ మందులిచ్చి, చికిత్స చేశారు. కాసేపటికి బాలుడి నోటి నుంచి నురుగు రావడంతో పరిస్థితి విషమించిందని, మరో ఆస్పత్రికి తీసుకువెళ్లాలని డాక్టర్ సూచించారు. దీంతో తల్లిదండ్రులు బాలుడిని పావగడకు తీసుకువెళ్లారు. అప్పటికే పసివాడు ప్రాణాలు కోల్పోయాడు. తమ కుమారుడిని ముందుగానే వేరే ఆస్పత్రికి పంపించి ఉంటే బతికేవాడని తల్లిదండ్రులు అన్నారు. పరిస్థితి విషమించాక చేతులెత్తేశాడని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని, క్లినిక్‌ను మూసివేయాలని బాలుడి తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేశారు.



వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించిన విద్యార్థినులు

గొప్ప మనసులు..!

అయినవారు పట్టించుకోలేదు.. ఆలనాపాలనా చూసుకోలేదు. వృద్ధుడిని రోడ్డున పడేశారు. అయ్యా.. అమ్మా.. అంటూ దారిన వెళ్లేవారిని యాచిస్తూ ఉన్నాడు.. తిండిలేక, నీరులేక.. నీరసించిపోయాడు. అందరూ చూస్తూ.. వెళ్తున్నారే తప్ప.. ఎవ్వరూ పట్టించుకోలేదు. చదువుకునే చిట్టి తల్లులు.. ఆ అభాగ్యుడి దీనస్థితిని చూసి, చలించిపోయారు. అన్నం పెట్టి, నీరు ఇచ్చారు.. కాళ్లకు పుండ్లు ఏర్పడి, పురుగులు పట్టడాన్ని గమనించి అయ్యో.. పాపం.. అనుకున్నారు. వెంటనే ఆటోలో ఆస్పత్రికి చేర్చారు. చికిత్స చేయించారు. పెద్దమనసు చాటుకున్న ఆ అమ్మాయిలు కల్యాణి, త్రివేణి, శిరీష, లతాశ్రీ. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాల ముందు కొన్ని రోజులుగా దీనస్థితిలో యాచిస్తున్న వృద్ధుడిని శనివారం సర్వజనాస్పత్రికి తరలించారు. అయిన వాళ్లే కాదనుకున్న ఆ అభాగ్యుడి పట్ల మానవత్వం చూపారు. గొప్ప మనసు చాటుకున్నారు. వారిని ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది అభినందించారు. వృద్ధుడిని వివరాలు ఆరాతీయగా.. తన పేరు సత్యనారాయణ అనీ, తనది బుక్కపట్నం అని చెప్పారు. కుటుంబ సభ్యుల వివరాలు మాత్రం వెల్లడించలేదు. తన పిల్లలకు ఎక్కడ చెడ్డపేరు వస్తుందోనని ఎంత అడిగినా వారి గురించి మాత్రం చెప్పలేదు. అదే తండ్రి మనసు.

- అనంతపురం విద్య, ఆంధ్రజ్యోతి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విడపనకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అజ్మతుల్లా శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ సమాఖ్య అధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్-14, 17, 19, విభాగాల్లో కరకముక్కల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ఏడో తరగతి విద్యార్థి హెచ్ అఖిల్, అండర్ 17లో పదో తరగతి చదువుతున్న సుజాత, అండర్ 19 విభాగంలో తొమ్మిదో తరగతికి చెందిన ఎం భానుప్రియ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. త్వరలోనే ఉరవకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. వారిని టీచర్లు అభినందించారు.

రొద్దం విద్యార్థులు..



విద్యార్థి వేదవ్యాస్‌ను అభినందిస్తున్న టీచర్లు

రొద్దం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొద్దం, తురకలాపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల బుక్కపట్నం డైట్ కళాశాలలో నిర్వహించిన కళా ఉత్సవ్ 2025 పోటీల్లో రొద్దం పాఠశాలలో 9వ తరగతి చదివే వేదవ్యాస్ సంగీత వాయిద్య పోటీల్లో ప్రతిభ చాటి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. అక్టోబరులో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. తురకలాపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన సాయి, ప్రణీత్ రాజ్, దీక్షిత్‌రెడ్డి సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రామకృష్ణ తెలిపారు. అక్టోబరు 4నుంచి విశాఖపట్నం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం లింగప్ప, టీచర్లు అభినందించారు.

అసంపూర్తి నిర్మాణాలు

- దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న ప్రభుత్వ భవనాలు
- ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకోని పాలకులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు


ఉన్నత పాఠశాలలో అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణ పనులు

నల్లమాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పాలనను ప్రజలు అందుబాటులోకి తీసుకురావాల్సిన పలు ప్రభుత్వ భవన అసంపూర్తి నిర్మాణాలతో దిష్టి బొమ్మల్లా మండలంలో దర్శనమిస్తున్నాయి. నల్లమాడలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి నాబార్డు ద్వారా రూ. 1,11,90,000 నిధులు మంజూరయ్యాయి. దాదాపు నాగేళ్ల క్రితం ఈ భవన నిర్మాణం ప్రారంభించి, కొంతవరకు నిర్మించి వదిలేశారు. అసంపూర్తిగా ఉన్న భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. కొంత మంది ఆకతాయిలు ఆ ఆభవనంలో నిత్యం బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నారు. మరి కొంతమంది గుట్కా నమలడం, పొగ తాగడం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఆ సమయంలో ఎవరైనా విద్యార్థినులు తరగతి గదుల నుంచి బయటకు వచ్చి ఆ భవనాల ముందు నుంచి వెళ్తున్నప్పుడు వారిని అసభ్యంగా మాట్లాడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఒకటి రెండు మార్లు అటువంటి యువతను మందలిచినట్లు తెలుస్తోంది. అయినా పరిస్థితుల్లో ఎటువంటి మార్పు రాలేదు. ఈ భవనం పూర్తి అయితే విద్యార్థినులకు సమస్య తప్పుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. అలాగే మండలకేంద్రంలోని 30పడకల ప్రభుత్వ ఆసుపత్రిని, దాన్ని వంద పడకలకు మార్చేందుకు ప్రభుత్వం అదనపు భవన నిర్మాణాలను మూడేళ్లక్రితమే ప్రారంభించింది. ఈ భవన నిర్మాణానికి రూ. 2. 65 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ భవనం నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ఆసుపత్రిలో రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నా గదుల కొరతతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. చికిత్సల కోసం రోగులు ఆసుపత్రిలోనే ఉండాల్సి వస్తే, అవసరమైనన్ని గదులు లేకపోవడంతో ప్రతిరోజు ఇళ్లకు వెళ్లి రావాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే ఏమైనా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిందే పోస్టుమార్టం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. నల్లమాడ ఆసుపత్రిలో అదనపు గదుల్లో భాగంగా పోస్టు మార్టం గదిని ఏర్పాటుచేశారు, అసంపూర్తి భవన్నాన్ని త్వరగా పూర్తి చేస్తే, రోగులకు చికిత్సలు పొందడానికి గదులతోపాటు, ఇక్కడే పోస్టుమార్టం చేయడానికి అవకాశముంటుందని ప్రజలు అంటున్నారు. ఈభవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే విలేజి క్లినిక్‌లు మండల వ్యాప్తంగా 12 మంజూరయ్యాయి. ఒక దానికి రూ.23. 50లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే ఎర్రవంకపల్లి, వేళ్లమద్ది, పాతబత్తల పల్లి పంచాయతీల్లో విలేజి క్లినిక్‌లు పూర్తి అయి వైద్యాధికారులకు భవనాలను అప్పగించారు. ఇంకా నల్లమాడ, ఎద్దులవాండ్లపల్లితండా, వంకర కుంట, బండవాండ్లపల్లిల్లో భవనాలు 80శాతం పూర్తికాగా మరో 20శాతం పూర్తి చేయాల్సి ఉంది. అరకొరగా పనులుండడంతో నిరుపయోగంగా దర్శన మిస్తున్నాయి. అంతేకాకుండా కురమాల, దొన్నికోట, గోపేపల్లి, చారుపల్లి పంచాయతీల్లో విలేజి క్లినిక్ భవనాలు పునాదులకే పరిమితమయ్యాయి. ఇలా మండలంలో పలుచోట్ల గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇలాంటి భవనాలను పాలకులు గుర్తించి, త్వరగా వాటి నిర్మాణాలను పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు అంటున్నారు.



నిర్మాణం పూర్తికాకుండానే ఆసుపత్రి అదనపు గదులకు రంగులు వేసిన దృశ్యం

న్యూస్ బాక్స్

కలెక్టర్ చేతన్ సహకారం మరువలేనిది

- పరిటాల శ్రీరామ్


బదిలీ కలెక్టర్ టీఎస్ చేతన్‌ను సన్మానిస్తున్న పరిటాల శ్రీరామ్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న టీఎస్ చేతన్ జిల్లా అభివృద్ధికి అందించిన సహకారం మరవలేదని, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్‌ను పరిటాల శ్రీరామ్ శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. జిల్లాలోనే కాకుండా ధర్మవరం నియోజకవర్గంలో ఏ సమస్య గురించి చెప్పినా, వెంటనే స్పందించేవారన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే కలెక్టర్‌గా చేతన్ నిలుస్తారని శ్రీరామ్ పేర్కొన్నారు.

పరిటాల శ్రీరామ్‌కు సొసైటీ చైర్మన్ కృతజ్ఞతలు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నూరు బత్తలపల్లికి చెందిన మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు గొట్లూరు సహకారసంఘం బ్యాంకు చైర్మన్‌గా ఎంపికయ్యారు. దీంతో ఆయన శనివారం రాత్రి టీడీపీ నాయకులతో కలిసి పరిటాల శ్రీరామ్‌ను అనంతపురంలోని ఆయన నివాసంలో కలిశారు. తన ఎంపికకు సహకరించిన పరిటాలశ్రీరామ్‌కు మేకల రామాంజినేయులు గజమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి విజయసారథి, నాయకులు భాస్కర్‌చౌదరి, ఏగినాటి రమణ, జంగం నరసింహులు, తెలుగుయువత విజయ చౌదరి, రమేష్‌నాయుడు, అమరా సుధాకర్, మల్లేనిపల్లి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేయూత

ధర్మవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినికి తోటి విద్యార్థులు చేయూతనందించారు. ఆ విద్యార్థిని కాలేయ సమస్యతో కొంతకాలంగా బాధపడుతోంది. అయితే మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు రూ.25 లక్షలు ఖర్చువుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థినులు కళాశాల సాయంతో రూ.80వేలు సమకూర్చి వారి తల్లిదండ్రులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వంశీకృష్ణ, ప్రిన్సిపాల్ మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

కొత్తచెరువు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తలమర్ల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన నంజిరెడ్డి, మారుతీప్రసాద్‌రెడ్డి, రామ చంద్ర, సాలక్కగారి కిశోర్ శనివారం విద్యాసామగ్రిని అందజేశారు. దాదాపు రూ.5 వేలు విలువ చేసే నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను విద్యార్థుల సౌకర్యార్థంఅందజేసినట్లు మారుతీప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రిషి పాఠశాలకు జాతీయ స్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న పాఠశాల అధినేత

ధర్మవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిషి పాఠశాల జాతీయ స్థాయిలో బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్ అవార్డును దక్కిం చుకున్నట్టు పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపా ల్ కరుణ్‌స్వరూప్‌సింగ్ తెలిపారు. ఈ అవార్డును పాఠశాల అధినేత శుక్రవారం డిల్లీలో అందుకున్నట్టు వారు తెలిపారు. దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించిన సిఫోర్ పరిశోధనా సంస్థ ఈ గుర్తింపును ప్రకటించిందన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించ డానికి ప్రపంచస్థాయి ఉత్తమ పద్ధతులను అనుసరిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో సీఏఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యతోపాటు విలువలు ముఖ్యం

● ధర్మవరం: విద్యతోపాటు విలువలు, సంస్కారం విద్యార్థి దశలోనే నేర్చుకోవాలని రిషి పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ్‌స్వరూప్‌సింగ్ పేర్కొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ధర్మవరం శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రతిభ పాటవ, వ్యా సరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ వైస్ ప్రసిడెంట్ మంజునాథ్, సెక్రటరీ కోనాపురం సాయిప్రసాద్, డైరెక్టర్ సోమేశ్వర్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు మారుతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బుక్కపట్నం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎద్దులబండి కింద పడి గాయపడిన హేమంత్‌కుమార్(19) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. గత నెల 28వ తేదీన వినాయక చవితి సందర్భంగా మండల పరిధిలోని జానకంపల్లిలో ఎద్దులబండి పోటీలు నిర్వహించారు. ఆ సమయంలో పరుగెడుతున్న ఎద్దులబండిని పొటోతీసే క్రమంలో హేమంతకుమార్ ఎద్దులకింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ తెలిపారు. హేమంత్ కుమార్ తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

ధర్మవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, చేనేత ప్రముఖులు సందా రాఘవ, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ శనివారం కేశగాళ్ల శ్రీనివాసులు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. వారితో పాటు టీడీపీ నాయకులు నాగూర్‌హుస్సేన్, పురుషోత్తంగౌడ్, జింకా పురుషోత్తం, కొత్తపేట ఆది, జింకల రాజన్న, బొట్టుకిష్ట, వీరయ్య, సాయి, చంద్ర, పెద్దన్న ఉన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


హిందీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉషోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హిందీ పండితులైన జయరాం, మహేశ్‌ను కరస్పాండెంట్ చాంద్‌బాషా శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో హిందీభాష గురించి నాట్య ప్రదర్శన చేశారు. పాఠశాల డైరెక్టర్లు ప్రభాకర్, సుబ్బారావు, హెచ్ఎం నాగభూషణం, శంషాద్‌బేగం, ఇన్‌చార్జ్ బినోయ్‌ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీతో జీవితం సుఖమయం

- లోక్ అదాలత్‌లో న్యాయాధికారుల సూచన


ధర్మవరంలో లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు

ధర్మవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గం ద్వారానే జీవి తం సుఖమయం అవుతుందని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బొజప్ప పేర్కొన్నా రు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు మాట్లాడుతూ... జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ లోక్‌అదాలత్‌లో 28 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇందులో ప్రీలిటికేషన్ కేసులు 8(రూ.5.57లక్షలు), సివిల్‌కేసులు 3(రూ.50వేలు), చెక్‌బౌన్స్ కేసులు 4(రూ.17.50లక్షలు), ఎక్సైజ్ కేసులు 2(రూ.16500), ఇతర కేసులు 11 మొత్తం 28 కేసులు పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

● కదిరి లీగల్: ప్రజల మధ్య సమన్వయం ఏర్పరచి ప్రజా సంక్షేమాన్ని కాంక్షించేదే ప్రజా న్యాయస్థానమని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌ఆదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. మరో న్యా యాధికారి పీ లోకనాథం, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కే చౌడప్ప, వివిధ బ్యాంకుల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయాధికారి జయలక్ష్మి నేతృత్వంలో ఒక బెంచ్... న్యా యాధికారి జ్ఞానవర్ధన్ రెడ్డి, న్యాయాధికారి లోకనాథం మరో బెంచ్ ద్వారా న్యాయ సహాయకులు లోకేశ్వర్ రెడ్డి, రఘు పాల్గొని కేసులను పరిష్కరించారు. మొత్తం 685 కేసులను పరిష్కరించినట్లు ప్రజా న్యాయస్థాన కార్యాలయం వెల్లడించింది.

● ముదిగుబ్బ: మండలకేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న 11 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ శివరాముడు పేర్కొన్నారు. సీఐ శనివారం విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాల నుంచి పలు కేసులు పరిష్కారం కాని ఆ సమస్యలు కదిరి లోక్ అదాలత్‌లో పరిష్కారం అయినట్లు ఆయన తెలిపారు.


కేసుల పరిష్కారం తరువాత అధికారిక పత్రాలను అందజేస్తున్న న్యాయాధికారులు

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి డి మాండ్ చేశారు. ఆయన శనివారం ధర్మవరం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 15వ తేదీ నుంచి రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15న కర్నూల్‌లో, 16న అనంతపురం, 17న సత్యసాయి జిల్లా, 18న అన్నమయ్య జిల్లా, కడపజిల్లా, 19న కడప, నంద్యాల జిల్లాలో ఈ రణభేరి యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రకు ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాతపెన్షన్ విధానాన్ని 2003 ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ నాయక్, నాయకులు లక్ష్మయ్య, జింకా హరికృష్ణ, నాగిరెడ్డి, రామాంజి నేయులు, సాయిగణేశ్, ఆంజనేయులు, ఆమర్ నారాయణరెడ్డి, రాంప్రసాద్, బిల్లే రామాంజినేయులు, వెంకటకిశోర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి: ఏపీటీఎఫ్

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం ద్వారా పరిష్కరించేలా చూడాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ బాబుకు నాయకులు విన్నవించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు బీకేము త్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీంద్రారెడ్డి, బలరాముడు శనివారం ఆయనను ఎన్డీఏ స్థానిక కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజే శారు.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మంత్రి సత్యకుమార్ అందుబాటులో లేనందున హరీశ్‌బాబుకు వినతిపత్రం అందజేశామ న్నారు. ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకపోతే దశలవారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ధర్మవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివానంద, ఈశ్వరయ్య, బత్తలపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, నాగశేషు, చెన్నేకొత్తపల్లి మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, దుర్గాప్రసాద్, నాయకులు ఈశ్వరయ్య, గోపి, నాగప్ప, మారెప్ప, గోపాలకృష్ణ, బయన్న, నరసింహులు, వాసుకుమార్, శంకర్, నారాయణ, హేమంత్, బాలయ్య, జగదీశ్, రవికుమార్, చంద్రుడు, చంద్రశేఖర్, లోకేశ్, ఆదినారాయణ, నరసింహమూర్తి, భాస్కర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 26వ వార్డు మహాత్మాగాంధీ కాలనీకి చెందిన వడ్డె వెంకటేశ్(54)క్యాన్సర్ వ్యాధితో శనివారం ఉదయం మృతిచెందాడు. 26వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ చీమల నాగరాజు మృతుడి ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు బత్తూరు బాలకృష్ణ, మరుస తరుణ్, నీరుగంటి నాగేంద్ర, చీమల జయ పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలో వేళ్లమద్ది గ్రామం ఎస్సీకాలనీకి చెందిన ఎస్ నరసింహులు (55) అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ నాయకులు శనివారం మృతదేహం వద్ద నివాళ్లు అర్పించి, అంత్యక్రియల కోసం మృతుడి భార్య ఓబుళమ్మకు రూ.5వేలు సాయం అందించారు. నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, మిల్టరీ రహిమాన్, నారాయణస్వామి, పూల రామయ్య తదితరులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధిపై అవగాహన

గాండ్లపెంట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నివారణపై మండలంలోని పశువుల యజమానులకు పశువైద్యాధికారి చెన్నకేశవులనాయక్ శనివారం అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని పశువైద్య కార్యాలయంలో గాలికుంటు వ్యాధి గురించి వివరించారు. వ్యాధి సోకుండా ముందస్తుగా టీకాలు వేయించు కోవాలని సూచించారు.

ఎయిడ్స్‌పై...

● తనకల్లు: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినులకు ఎయిడ్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్, టోల్ ఫ్రీ నెంబర్ 1097గురించి వివరించారు. డ్రగ్స్ వాడకం వలన కలిగే నష్టాలను తెలిపారు. జనజాగృతి ప్రాజెక్టు మేనేర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన డ్రాగన్ లెవెన్, హిందూపురం హంటర్స్

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నీ సీజన్-2 సెమీఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగాయి. శనివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో డ్రాగన్ లెవెన్స్ జట్టు గొట్లూరు జట్లు తలబడ్డాయి. డ్రాగన్‌లెవెన్స్ జట్టు 12ఓవర్లలో 174పరుగులు సాధించింది. ప్రత్యర్థిగా బరిలో దిగిన గొట్లూరు జట్టు 100 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పరాజయం పాలైంది. దీంతో డ్రాగన్ లెవెన్ జట్టు 74పరుగులతో విజయం సాధించింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో లక్ష్మీనరసింహ లెవెన్స్ జట్టు, హిందూపురం హంటర్స్ జట్టు తలబడ్డాయి. టాస్ గెలిచి బరిలో దిగిన లక్ష్మీనరసింహజట్టు 12ఓవర్లలో 4 వికెట్లుకు గాను 103 పరుగులు చేసింది. ప్రత్యర్థి జట్టు హిందూపురం హంటర్స్ జట్టు కేవలం 7ఓవర్లలోనే 8 వికెట్ల తేడాతో 108పరుగులు సాధించి ఘన విజయం సాధించింది. ఈ రెండు మ్యాచ్ లలో విశేషప్రతిభ కనబరిచిన డ్రాగన్ లెవెన్స్ జట్టులో ప్రశాంత్‌రెడ్డి, హిందూపురం హంటర్స్ జట్టులో అయాజ్‌కు మ్యాచ్‌ఆఫ్‌ది మ్యాచ్ దక్కాయి. వీరికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ హనుమంతప్ప, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కొంకా నాగార్జున, కోచ్‌లు షీల్డులు అందజేసి అభినందనలు తెలిపారు. విజేతలైన రెండు జట్లు ఫైనల్స్ కు చేరుకున్నట్లు తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌ను ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.


క్రీడాకారులకు షీల్డ్ అందజేస్తున్న నాయకులు, కోచ్‌లు

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి

నల్లచెరువు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపాటి దిన్నె ఆంజనే యస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం ఆలయ శుద్ధి, స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, ఆకుపూజ, అర్చనలు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధికి, అన్నదానానికి పలువురు దాతలు విరాళం అందజేశారు.

● ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరులో వెలసిన అంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సత్యనారాయణ మూలవిరాట్ కు అభిషేకాలు చేసి, ఆకుపూజ, అర్చనలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

జౌకలలో విద్యుత్ సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి స్పందన


జౌకలలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జౌకల గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించారు. మండలంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం గురించి ఆంధ్రజ్యోతి దినపత్రిలో శుక్రవారం 'కరెంటోళ్ల మొద్దు నిద్ర' అన్న వార్త ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు ట్రాన్స్‌కో ఏఈ సాలేహా బాషా స్పందించారు. జౌకల గ్రామంలోని రాజారెడ్డి ఇంటి సమీపంలో కూలిన విద్యుత్ స్తంభం స్థానంలో నూతన స్థంభాన్ని శనివారం ఏర్పాటు చేశారు. గ్రామా నికి విద్యుత్ సరఫరా చేశారు. దీంతో గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. మండలకేంద్రానికి సమీపంలోని దేవరచెరువు వద్ద విద్యుత్ లైన్లు లాగారు. దీంతో రైతులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిమితికి మించి ప్రయాణంపై చర్యలు


బస్టాండ్‌లో మహిళా కూలీలు

తనకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లి వద్ద ఇటీవల పలు ప్రమాదాలు సంభవించాయి. ఇందులో పరిమితికి మించి ఆటోల్లో మహిళ కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న సందర్భంగా జరిగినవే అధికం. దీనిపై తనకల్లు పోలీసులు చర్యలు చేపట్టారు. నల్లమాడ మండలంలోని దొన్నికోట, నల్లచెరువు మండలంలోని రాట్నాలపల్లి, తనకల్లు మండలంలోని వివిధ గ్రామాల నుంచి శనివారం పరిమితికి మించి కూలీలతో సుదూర ప్రాంతాలకు వెళుతున్న ఆటోలపై మండలకేంద్రంలో మెరుపు దాడులు నిర్వహించారు. అలా వెళుతున్న కూలీలందరిని తనకల్లులోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆటోల నుంచి దింపి, ఆర్టీసీ బస్సులు ఎక్కేలా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికి కొంతమంది ఆటో డ్రైవర్లు పోలీసుల కళ్లు కప్పి కూలీలను అలాగే తీసుకెళ్లారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ల స్వాధీనం


ముదిగుబ్బ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపారు. మండల పరిధిలోని ఉప్పలపాడు సమీపంలో చిత్రావతి నది నుంచి శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేశారు. వాటిని జిల్లా మైన్స్ జియాలజీ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టుకు దాడితోట విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులు

తాడిమర్రి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ జట్టుకు దాడి తోట ఉన్నత పాఠ శాలకు చెందిన విద్యార్థులు మైథిలి, అభిరామ్ ఎంపికైనట్టు పీఈటీ జయలక్ష్మి తెలిపారు. ఈ నెల 9న అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్ బాబు, ఉపాధ్యాయులు శనివారం పాఠశాలలో అభినందించారు.

డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులు



జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులు

తాడిమర్రి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి గ్రూపు డ్యాన్స్ పోటీలలో మండలంలోని దాడితోట ఉన్నతపాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. వారిని ఉపాధ్యాయ బృందం శనివారం పాఠశాలలో అభినందించారు. ఈ నెల 11, 12 తేదీలలో ప్రభుత్వ డైట్ కళాశాల మైదానంలో జరిగిన కళా ఉత్సవ్ పోటీలలో విద్యార్థులు బృంద నృత్యంతో సంప్రదాయ నృత్య కళారూపాలను ప్రతిబింబించేలా ప్రతిభ కనబరిచారని హెచ్ఎం ఉమామహేశ్‌బాబు తెలిపారు. దీంతో వారికి మొదటి స్థానం దక్కిందని, ప్రశంసాపత్రంతో పాటు బహుమతులు అందజేసినట్టు హెచ్ఎం తెలిపారు. వీరు అక్టోబరు నెలలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

న్యూస్ బాక్స్

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



భజనలు చేస్తున్న యాదవులు

అగళి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంఎంపాళ్యం గ్రామంలో వెలసిన గురుదత్తాత్రేయ స్వామి ఆలయం వద్ద ఇస్కాన్ టెంపుల్ వారు శ్రీకృష్ణ జన్మాష్టమిని శనివారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు నాగరాజు తెలిపారు. వేదపండితులు సాయంత్రం అగళి నుంచి ఎంఎం పాళ్యం దత్తాత్రేయస్వామి ఆలయం వరకు మంగళవాయిద్యాలతో హరినామ సంకీర్తనలతో స్వామివారిని ఊరేగించారు. భక్తాదులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

బాల చౌడేశ్వరికి ప్రత్యేక పూజలు

పరిగి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటకూరు గ్రామంలో వెలసిన బాలచౌడేశ్వరి గ్రామదేవతను ప్రత్యేక పూజలు చేశారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి గ్రామంలోని వీధుల్లో పూలపల్లకిలో ఊరేగించారు.

హిందీ భాష ఎంతో అవసరం



హిందీ అక్షరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హిందూపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో దేశ విదేశాల్లో ఉద్యోగ, వ్యాపారాలు చేయాలంటే హిందీ భాష ఎంతో అవసరమని వక్తలు అన్నారు. శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని పాంచజన్య పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగ రూపకర్తలు హిందీని జాతీయభాషగా ఆమోదించారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నందకుమార్, హెచ్ఎం గాయిత్రి, ఏఓ భాస్కర్ పాల్గొన్నారు. అలాగే సంతేబిదునూరు ప్రభుత్వ పాఠశాలలో హిందీ భాష దినోత్సవాన్ని నిర్వహించారు.

రణభేరిని విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. గోరంట్లలో ఇందుకు సంబంధించి పోస్టర్లను శనివారం విడుదల చేశారు. పలు పాఠశాలలను సందర్శిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని పెనుకొండలో 17న ప్రారంభించి, గోరంట్ల మీదుగా సాయంత్రానికి కదిరి చేరుకుంటుందన్నారు. కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మురళీ, రామాంజనేయులు, శ్రీధర్‌రావు, క్రిష్టప్ప, రామక్రిష్ణ, నగేష్,ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థుల నృత్య ప్రదర్శన

గోరంట్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఇష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితలు సాధించవచ్చని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, భక్తవత్సలం తెలిపారు. శనివారం గోరంట్లలోని ఎస్‌కేడీఆర్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధికారోహించి, తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని కోరారు. పోటీతత్వమున్న సమాజంలో నెగ్గాలంటే గుణాత్మక విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు, సంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. అధ్యాపకులు ఆజాద్, అరవింద్, బాలమోహన్, కవిత, హర్షియా, గోవింద్ పాల్గొన్నారు.

చెరువుకట్ట పరిశీలన



చెరువుకట్టను పరిశీలిస్తున్న ఏఈ, టీడీపీ నాయకులు

సోమందేపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి చెరువుకట్టను శనివారం ఇరిగేషన్ ఏఈ వినోద్‌కుమార్, టీడీపీ నాయకుడు నీరుగంటి చంద్ర పరిశీలించారు. కట్టపై పెరిగిన ముళ్లకంపలు, పిచ్చిమొక్కలను వారు తొలగింపచేశారు. తూము మరమ్మతులు, కట్టపై మట్టి చదును పనులు, రైతుల పొలాలకు వెళ్లే రహదారి నిర్మాణంపై ఆరాతీశారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు తయారుచేస్తామన్నారు. నిధులు మంజూరుకాగానే మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు. నాయకులు సూరీ, కిష్టప్ప, బాబయ్య, మహేంద్ర, మద్దిలేటి, అన్వార్, షాషావలి, గోపీ, పరంధామ, జబీవుల్లా, వేణు పాల్గొన్నారు.

చెత్త కుప్పను తొలగించాలి



మోరుబాగల్ రోడ్డుపక్కన ఉన్న చెత్తకుప్ప

గుడిబండ, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరుబాగల్ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న చెత్తకుప్పను తొలగించాలని గ్రామస్థులు కోరారు. ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టినా పంచాయతీ అధికారులు గ్రామంలో పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్తకుప్ప రోడ్డు పక్కన దర్శనమిస్తోంది. అధికారులు వెంటనే స్పందించి అపరిశుభ్రత తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



నిమజ్జనానికి తరలుతున్న మహాగణపతి



శోభాయాత్రలో పాల్గొన్న కళాకారులు

ఘనంగా హిందూ మహాగణపతి శోభాయాత్ర

అమరాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పంచాయతీ కార్యాలయం ఆవరణలో హిందూ మహాగణపతి సంఘం ఏర్పాటు చేసిన మహాగణపతి శోభాయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో వినాయకుని సేవలు చేయడం ద్వారా గ్రామంలో ప్రశాంతత లభిస్తుందన్నారు. అమరాపురం పట్టణంలోని ప్రధాన పురవీధుల్లో శోభాయాత్ర సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల నృత్యప్రదర్శన, డీజే కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా శోభయాత్రను నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ఇషాక్‌బాషా బందోబస్తు నిర్వహించారు. మహాగణపతి యువక సభ్యులు, కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు, శ్రీనివాస్, మూర్తి, హరీష్, హనుమంతరాయ పాల్గొన్నారు.

అగళి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. వినాయకుడిని పురవీధుల గుండా రంగులు చెల్లుకుంటూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. టీడీపీ జడ్పీటీసీ ఉమేష్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దగ్గరలోని చెరువులో గణేశుడిని నిమజ్జనం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.



అగళిలో నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయకుడు

నూతన భవనాలు మంజూరు చేయండి



హైకోర్టు న్యాయమూర్తితో మాట్లాడుతున్న బార్‌అసోసియేషన్ సభ్యులు

హిందూపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో న్యాయస్థాన సముదాయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కూల్చివేసి నూతన భవనాలు మంజూరు చేయాలని బార్‌అసోసియేషన్ సభ్యులు కోరారు. శనివారం లేపాక్షికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి ఉమ్మడిఅనంత జిల్లా పరిపాలన న్యాయాధికారి రామక్రిష్ణ ప్రసాద్‌ను పురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. హిందూపురంలో నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయాధికరుల పోస్టులు కూడా భర్తీచేయాలన్నారు. న్యాయవాదులు శివశంకర్, వన్నేరప్ప పాల్గొన్నారు.

వృద్ధురాలికి సాయం



బాధితురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వినాయకనగర్‌కు చెందిన వృద్ధురాలు తాహిరా ఇల్లు శుక్రవారం రాత్రి కూలిపోయింది. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు నీరుగంటి చంద్ర, సూరీ, జనసేన జబీవుల్లా ఇంటివద్దకు వెళ్లి ఆమెను పరామర్శించారు. నిత్యావసర సరుకులు, రూ.11వేలు అందజేసి ఆమెకు అండగా నిలిచారు. అధికారులతో మాట్లాడి త్వరలో పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

కంపచెట్ల తొలగింపు



కంపచెట్లు తొలగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

పరిగి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో విద్యుత్ తీగలపై ఏపుగా పెరిగిన కంపచెట్లను ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప శనివారం తొలగింపచేశారు. లైన్‌మెన్ నాగభూషణం, నయాజ్, పంచాయతీ పరిధిలోని ఊటకూరు-పరిగి రోడ్డుపక్కన కంపచెట్లు ఏపుగా పెరిగి విద్యుత్ తీగలను తాకుతున్నాయి. కూలీల సాయంతో వాటిని తొలగింపజేశారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



నూతన కమిటీ సభ్యులతో రైతు సంఘం నాయకులు

రొద్దం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం నాయకుడు హరి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రొద్దకాంబ ఆలయం వద్ద మండలస్థాయి మహాసభ నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి గిట్టుబాటు ధరలు అందకపోవడంతో అప్పులపాలవుతున్నారన్నారు. సాగు విస్తీర్ణం తగ్గిపోతుందని కుటుంబ పోషణ భారమై రైతులు వలస కూలీలుగా మారుతున్నారన్నారు. సకాలంలో ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 50వేల ఎకరాలదాకా రైతు లు భూములను సోలార్ కంపెనీలకు అప్పగించినప్పటికీ ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేస్తోందని విమర్శించారు. అనంతరం మండల కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసచారి, కార్యదర్శిగా గిరీష్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కోగిర నారాయణ, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యయతి): సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక సివిల్‌సప్లై గోడౌన్‌వద్ద నాయకులు నాగరాజు, బాబావలి ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు బావమ్మ, మహబూబ్‌బాషా, నరసింహ, సుధాకర్, హనుమంతు, వలి, తిప్పన్న, సలీం, బాబు, నాగేంద్ర, ఓబులేసు పాల్గొన్నారు.

చలో సూర్యపేటకు రామమూర్తిస్వామి

పావగడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ రాష్ట్రం సూర్యపేట జిల్లాలో బాలాజీ గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమానికి పావగడ నుంచి సర్వధర్మ శాంతి పీఠం అధ్యక్షుడు రామమూర్తి స్వామీజీ వెళుతున్నారు. ఆదివారం ఉదయం జరిగే కార్యక్రమానికి నాగ సాధువులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, అఘోరాలు, హిందూ సంఘ సంస్థలు పాల్గొంటున్నట్లు సనాతన ధర్మ సంరక్షణ సమితి అధ్యక్షుడు భైవరవేశ్వరానంద స్వామి తెలిపారు.



రామమూర్తి స్వామీజీని ఆహ్వానిస్తున్న సూర్యపేట భైరవేశ్వరానందస్వామి

రాజీమార్గం.. ఉత్తమం

● న్యాయాధికారి కంపల్లె శైలజ

హిందూపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారంలో రాజీమార్గం ఎంతో ఉత్తమమని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. 95కేసులు పరిష్కారం చేశారు. ఇందులో రెండు క్రిమినల్ అప్పీల్‌ద్వారా బాధితునికి రూ.4లక్షలు అందజేశారు. ఎనిమిది సివిల్ కేసులు పరిష్కరించి రూ.29.90లక్షలు అందించారు. ఆరు చెక్‌బౌన్స్ కేసులుపరిష్కరించి రూ.48.90లక్షలు ఇప్పించారు. ఒక టీవీసీ కేసు పరిష్కరించి బాధితురాలికి రూ.5లక్షలు అందించారు. వీటితోపాటు 59మద్యం కేసులు పరిష్కరించి రూ.2.57లక్షలు అపరాధ రుసుం విధించారు. ఎనిమిది బ్యాంక్ కేసులు పరిష్కరించి రూ.3.37లక్షలు బ్యాంకుకు జమచేయించారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్, ప్రత్యేక న్యాయాధికారి రమణయ్య, ఏపీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.



అవార్డు ప్రతిని అందజేస్తున్న న్యాయాధికారులు

100 కేసుల పరిష్కారం

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): మడకశిర జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 100 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 19 క్రిమినల్ కేసులకు సంబంధించి రూ.26,000 జరిమానా వేసినట్లు తెలిపారు. ఎస్‌టీసీ 12 కేసులకు రూ,11,500, 5 సివిల్ కేసులు పరిష్కరించామన్నారు. ఎక్సైజ్ కేసులు 65కు గాను రూ.4,18 లక్షలను రికవరీ చేసినట్లు తెలిపారు. న్యాయవాదులు త్రిలోక్, భాస్కర్, గోపీ, లోకేష్, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

పెనుకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యయతి): సివిల్ సప్లై స్టాక్‌పాయింట్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న డీఈఓ, సెక్యూరిటీ, పంప్ బాయ్స్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సివిల్ సప్లై గోడౌన్‌వద్ద లక్ష్మీపతి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. స్టాక్‌పాయింట్ పరిధిలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నా ఎటువంటి గుర్తింపు లేకుండా వెట్టిచాకిరి చేయించడం బాధాకరమన్నారు. వీరికి జాతీయ సెలవులుకానీ, పండగ సెలవులుకానీ, టీఏ, డీఏలు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. స్టాక్‌పాయింట్‌లో ఏ పొరపాటు జరిగినా గోడౌన్ ఇన్‌చార్జిలు తప్పించుకుని డీఈఓలపై నెపం వేస్తున్నారన్నారు. సెక్యూరిటీగార్డ్‌లకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం, బదిలీలు చేసి ఇబ్బందికి గురిచేయడం మంచిదికాదన్నారు. దీనిపై జేసీకి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ వెంకటేశులు, నాగరాజు, బాబావలి ఆధ్వర్యంలో సీఐటీయూలో చేరారు.

నూతన జిల్లా కమిటీ ఏర్పాటు: సివిల్ సప్లై గోడౌన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సమీవుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీపతి, కోశాధికారిగా శివానంద, ఉపాధ్యక్షులుగా శ్రీలక్ష్మి, వీరభద్ర, సహాయ కార్యదర్శులుగా మహబూబ్‌బాషా, రెడ్డిశేఖర్‌లను ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, మండల కన్వీనర్ బాబావలి, డీఈఓలు, సెక్యూరిటీగార్డ్‌లు, పంప్‌బాయ్స్ పాల్గొన్నారు.



నూతన జిల్లా కమిటీ సభ్యులతో సీఐటీయూ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గుడిబండ మండలం, ఎస్.రాయపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీకి రాజీనామా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు వేసి గుండుమల సాదరంగా ఆహ్వానించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఎస్.రాయపురం గ్రామానికి చెందిన నాగరాజు, భారతితో పాటు 5 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, తమ్మన్న పాల్గొన్నారు.

తరగతుల నిర్వహణపై ఏఐఎస్ఎఫ్ ఆందోళన



కళాశాల ముందు ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పరిగి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లోనూ కాలువపల్లి వద్ద నున్న ప్రైవేట్ కళాశాల నిర్వహిస్తుండటంతో, విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు. జిల్లా సహాయ కార్యదర్శి అరవింద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యానిధి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాగే కొనసాగితే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని, వెంటనే వారిని వదిలేయాలని డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులను వదిలేసింది. కిరణ్, యశ్వంత్, పవేష్, అజయ్ పాల్గొన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సెలవుదినాల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహించడం తగదని పీడీఎస్‌యూ నాయకులు మండిపడ్డారు. రెండో శనివారం కూడా కొన్ని విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. అలాంటివాటిపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు బాబావలి, అనుదీప్, నజీర్, గణేష్‌రెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతన్నల పడిగాపులు



రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం వేచివున్న రైతులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నామని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న యూరియా రైతు భరోసా కేంద్రాలకు చేరింది. పెనుకొండ నగర పంచాయతీ మంగాపురం రైతు సేవా కేంద్రంలో యూరియా ఉందని రైతులు కేంద్రానికి చేరుకున్నారు. 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం పడిగాపులు కాశారు. రైతుసేవా కేంద్రంలో ఒక్కో రైతుకు ఒక్కో యూరియా బస్తా అందజేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండు బస్తాలైనా ఒక్కో రైతుకు ఇస్తే ఎకరా పంటకు వేసుకోవచ్చని అంటున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి ప్రతి రైతుకు రెండు బస్తాల యూరియా అందజేయాలని వారు కోరారు.

ఆటో, బస్సు ఢీ.. ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద 44వ జాతీయరహదారిపై ఆటోను వోల్వో బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ నాగరాజు ప్యాసింజర్ లక్ష్మీని ఎక్కించుకుని సోమందేపల్లి నుంచి పెనుకొండ వైపు వస్తున్నాడు. పులేకమ్మ ఆలయం వద్దకు రాగానే వెనుక నుంచి వోల్వో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

భవన నిర్మాణ కార్మికుడికి..

గోరంట్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న భవనం పై అంతస్తునుంచి ప్రమాదవశాత్తు కార్మికుడు కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గోరంట్ల పట్టణానికి చెందిన వీరాంజనేయులు అనే భవన నిర్మాణ కార్మికుడు పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడినట్లు తెలిసింది. తీవ్రవంగా గాయపడిన అతన్ని భవన యజమాని వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ వినోద్‌కుమార్ ప్రథమచికిత్సలు చేసి,మెరుగైన చికిత్స కోసం హిందూపురం తరలించారు.

వాహన చోదకులూ.. జర భద్రం



రోడ్డుమధ్యలో ఏర్పడిన గుంతలో టెంకాయ పట్ట అడ్డం పెట్టిన దృశ్యం

హిందూపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హిందూపురం నుంచి లేపాక్షికి వెళ్లే రహదారిలో శ్రీకంఠపురం అయ్యప్పస్వామి ఆలయంవద్ద రోడ్డుమధ్యలో మోకాలులోతు గుంత ఏర్పడింది. నిత్యం వేలాది వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. ఆదమరిస్తే బోల్తాపడాల్సిందే. గుంత ఎక్కువగా ఉండటంతో ద్విచక్రవాహనంలో వచ్చేవారైనా, కారులో వచ్చేవారైనా పడితే ప్రమాదం జరగకమానదు. మున్సిపల్ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు

పురం సింగిల్‌విండో అధ్యక్షుడిగా శంకర్



హిందూపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హిందూపురం మం డలం కిరికెర సహకార సంఘం అధ్యక్షుడిగా మలుగూరుకు చెందిన శంకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేశారు. సభ్యులుగా నారాయణరెడ్డి, ఆదెమ్మలను నియమించారు.